ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి





సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

# ఆదర్శ నేత సీతారాం ఏచూరి

## సంస్మరణ సభలో ప్రముఖులు

**ప్రజాశక్తి- హిందూపురం**

దేశ రాజకీయాల్లో అరుదైన నాయకులు, ఆదర్శనేత సీతారాం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఏచూరి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడతూ ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. దేశ రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామిక మౌలిక విలువల పరిరక్షణ కోసం నిత్యం శ్రమించిన గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్‌కు దారిదీపం లాంటి నాయకుడిని దేశం కోల్పోయిందని పరస్పర బిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీల నాయకత్వాలు (ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, సోని యాగాంధీ) పేర్కొనడాన్ని గుర్తు చేశారు. మాజీ మంత్రి రఘువీరా రెడ్డి మాట్లాడుతూ ఏచూరి విలక్షణ, విశిష్టత, వ్యక్తిత్వం కలిగిన నాయకునిగా నిలిచిపోయాడన్నారు. రాజ్యసభలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలవడంతో పాటు దేశంలోని ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటములకు ఇరుసుగా నిలిచారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలిగా నిలిచారన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవ దానం చేయడం చూశామని, తన పార్థివ దేహాన్ని సైతం సమాజ హితం కోసం ఎయిమ్స్‌కు అప్పగించిన అరుదైన గొప్ప నేతల్లో ఏచూరి ముందు వరుసలో నిలుస్తారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం మొదలుకుని విద్యార్థిఉద్యమం వరకు ఏచూరి పోరాట పటిమ ఎనలేనిదని అన్నారు. వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేటి శ్రీధర్, ఎస్ యు సి ఐ పార్టీ నాయకులు గిరీష్, బీఎస్పీ శ్రీరాములు, చైతన్య గంగారెడ్డి, జెవివి డాక్టర్ ఈటి రాంమ్మూర్తి, టిప్పు సుల్తాన్ యూనెటెడ్ జాతీయ నామకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఆర్ఎస్‌పి నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ దేశం సంక్షోభ సమయంలో ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బడా సుబ్బారెడ్డి, ఇఎస్ వెంకటేష్. జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి, ఎంఎస్ఎఫ్ నాయకులు రవి కుమార్. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, పెనుకొండ పెద్దన్న, ప్రజా సంఘాల నాయకులు శ్రీదేవి, సౌభాగ్య, లావణ్య, సాంబ, హిందూపురం సిఐటియు నాయకులు విఆర్ రాము, రామకష్ణ, జ్యోతమ్మతో పాటు ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పాలకవర్గ స్వరూపం మార్పుతోనే సమసమాజం

## లెనిన్ శతవర్ధంతి సభలో ప్రొఫెసర్ వికె.రామచంద్రన్





సమావేశంలో మాట్లాడుతున్న కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వి కె. రామచంద్రన్

**ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి**

'అధికార మార్పిడి జరిగినంత మాత్రానా సమసమాజ స్థాపన సాధ్యం కాదు.. పాలకవర్గ స్వరూపంలోనే మార్పు రావాల్సి ఉంది'ని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రొఫెసరు వికె.రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలోని అలేఖ్య ఫంక్షన్ హాలులో సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా 'రాజ్యం-విప్లవం' అన్న అంశంపై సదస్సు జరిగింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా వికె.రామచంద్రన్ మాట్లాడుతూ నేటి పెట్టుబడీదారి వ్యవస్థలో పేద, ధనికుల మధ్య అంతరాలు అనివార్యమని మార్క్స్, లెనిన్‌లు ఇద్దరూ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తు చేశారు. ఈ సమాజంలో పాలకవర్గాలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయన్నారు. అందుకే ఈ సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమని వివరించారు. రష్యాలో సోవియట్ పతనమైన 1991 తరువాత పెట్టుబడీదారి వ్యవస్థ మరింత బలపడిందన్నారు. భారతదేశంలోనూ స్వాతంత్రానికి పూర్వం సమసమాజ భావనలే అధికంగా ఉండేవని తెలిపారు. అయితే క్రమంగా వారి మారుతూ బడాపెట్టుబడి,పెట్టుబడి, భూస్వామ్య లక్షణాలు పెరిగాయని పేర్కొన్నారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలో అమలు చేయడం ప్రారంభించాక మరింత వేగవంతమయ్యాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడైందన్నారు. అప్పటి నుంచి ఆర్థిక అంతరాలు మరింతగా పెరుగుతూపోతున్నాయన్నారు. దేశంలో 271 మంది బిలియనర్స్ ఉన్నారన్నారు. ఇందులో 94 మంది గడిచిన రెండేళ్లలో కొత్తగా పుట్టుకొచ్చారన్నారు. మరోవైపు పేదరికం, దారిద్ర్యం పెరుగుతోందన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదన్నారు. ఇది యూనెస్కో చెబుతున్న గణాంకాలేనని వివరించారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. రోజూ పనికెళ్లినా కుటుంబం నెట్టుకురాలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయన్నారు. ఈ అంతరాలు పోవాలంటే పాలకవర్గ స్వభావం మార్చాల్సి ఉంటుందన్నారు. స్వభావం మారడమంటే సమాజ మార్పు జరగాల్సి ఉందన్నారు. ఈ లక్ష్యంతోనే 1964 తరువాత సిపిఎం ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి దేశంలో ఆర్థిక అసమానతలను రూపుమాపే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. దేశంలోనున్న నిర్దిష్ట పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా తమ ప్రణాళికలో మార్పులు చేసుకుని ముందుకెళ్లడం జరుగుతోందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనలను మరోమారు పునరుచ్చరణ చేసుకోవాల్సి ఉందన్నారు. అందుకోసమే ఆయన శతవర్ధంతి సభలను రాష్ట్రంలో ప్రత్యేకంగా ఈ ఏడాది నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.సావిత్రి, ఒ.నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో రోడ్డుపై మోకాలులోతులో నిలిచిన నీరు



హిందూపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

# దంచి కొట్టిన వాన

## పుట్టపర్తిలో గంటపాటు కుండపోత

## జిల్లావ్యాప్తంగా 463. 4 మిల్లీమీటర్ల వర్షపాతం

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

పుట్టపర్తి మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం ఒకగంట పాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు వర్షం దంచి కొట్టింది. రెవిన్యూ వారి గణాంకాల మేరకు ఒక పుట్టపర్తి మండలంలో 64.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లావ్యాప్తంగా ఎనిమిది మండలాలు మినహా మిగతా 24 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 463.4 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఈ వర్షం వల్ల మండలంలోని పలు చెక్ డ్యాములలోకి నీరు చేరింది.ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడిటంతో వేసవికాలంలో మాదిరి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు.

### పురంలో భారీ వర్షం....

**హిందూపురం :** పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు వివిధ ప్రాంతాలను పరిశీలించారు. జెసిబిలను ఏర్పాటు చేసి మురుగు కాలువల్లో పూడుకుపోయిన మురుగును బయటికి తీయించారు. మురుగు నీరు రోడ్లపై రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డి ఈ ఈ బాలసుబ్రమణ్యం, ఏఈ జనార్ధన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు దంపతులు మృతి

**ప్రజాశక్తి - గోరంట్ల**

గోరంట్ల మండలంలోని దిగువ గంగంపల్లి తండాలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పిడుగు పడి దిగువ గంగంపల్లి తండాకు చెందిన భార్య భర్త మృతిచెందాడు. అదే విధంగా రెండు ఆవులు మృతిచెందాయి. ఈఘటనకు సంబందించిన వివరాలు... గోరంట్ల మండలంలోని దిగువ గంగంపల్లికి చెందిన దశరథ నాయక్ (50), దేవి బాయ్ (45) తమకు చెందిన పాడి ఆవుల నుంచి పాలు పితకడానికి ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తమ ఇంటిపక్కనే ఉన్న షెడ్‌లోకి వెళ్లారు. ఆ సమయంలో జోరుగా ఉరుములతో కూడిన వర్షం పడుతోంది. ఉన్నఫలంగా పిడుగుపడిన శబ్దం వచ్చింది. ఆశబ్దానికి భార్యభర్త లిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. అక్కడే ఉన్న రెండు పాడి ఆవులు మృతిచెందాయి. అదే షెడ్‌లో నిద్రిస్తున్న దశరథ నాయక్ కుమారుడు జగదీష్ నాయక్ కూడా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతని పరిస్థితి విషమంగా ఇవ్వడంతో సమీప బంధువులు పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గంగంపల్లి తండాలో విషాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న సిఐ శేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి ఘటనావివరాలు అడిగి తెలుసుకున్నారు.

### మృతులకు నివాళి అర్పించిన మాజీమంత్రి

పిడుగుపాటుతో మృతిచెందిన దశరథ నాయక్, దేవి బాయ్ మృతదేహాలకు మాజీ మంత్రి శంకర్ నారాయణ నివాళులర్పించారు. అలాగే అంత్యక్రియలకు 20వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. మతుల కుటుంబాన్ని పరామర్శించారు.

### అండగా ఉంటాం : టిడిపి

**పెనుకొండ :** అధైర్య పడకండి అండగా ఉంటామనితెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాధితులకు ధైర్యం చెప్పారు. గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాకు చెందిన దాశరథనాయక్, దేవి భాయ్ పిడుగుపాటుతో మృతిచెందడంతో మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు మంత్రి సవిత ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు మంత్రి కషి చేస్తుందన్నారు. అనంతరం మృతుల అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సిద్దయ్య, మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు, గుట్టూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ

**పెనుకొండ టౌన్ :** గోరంట్ల మండలం దిగువ గంగంపల్లిలో పిడుగుపాటుకు దంపతులు మృతి చెందడం పట్ల హిందూపురం ఎంపీ బికె. పార్థసారథి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఢిల్లీ నుండి మృతుల కుటుంబాలకు ఫోన్‌లో పరామర్శించారు. పిడుగుపాటుకు భార్యాభర్తలు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ఎక్స్ గ్రేషియా ఇప్పించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

### రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**గోరంట్ల :** మండలంలోని దిగువ గంగంపల్లి తండాలో పిడుగుపాటుకు మృతిచెందిన దశరథ నాయక్ అతని భార్య దేవి భాయ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పెనుగొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నరసింహులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయపడిన జగదీష్ నాయక్‌కు కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. మతుల కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

**పెనుకొండ :** పిడుగుపాటుకు మృతిచెందిన గోరంట్ల మండల పరిధిలోని దిగువ గంగంపల్లి తండాకు చెందిన దాశరథి నాయక్, దేవి భాయ్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ. 4లక్షల ప్రకారం ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని మంత్రి సవిత తెలిపారు. పిడుగుపాటుకు భార్య భర్తలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతిచెందిన పాడి ఆవులకు ఒక్కొక్కదానికి రూ. 35 వేల ప్రకారం అందిస్తామన్నారు. మృతుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

### మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : కలెక్టర్

**పుట్టపర్తి అర్బన్ :** గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన వారి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. విషయం తెలిసిన వెంటనే ఆర్డీవో, తహశీల్దార్ ఇతర ి అధికారులను అప్రమత్తం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన నివేదికలు ఇస్తే మృతులకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ. 50 వేలు, మృతి చెందిన ఒక్కొక్క ఆవుకు 37,500 రూపాయల ప్రకారం పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వపరంగా ఉన్న అవకాశాల మేరకు ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని కలెక్టర్ తెలిపారు.

### పిడుగుపాటుకు విరిగిన చెట్టు

**మడకశిర రూరల్ :** పిడుగుపాటుకు మండల పరిధిలోని గౌడనహళ్లి చెరువు కట్ట వెనుక ఉన్న జాలిచెట్టు విరిగిపోయింది. గ్రామానికి చెందిన చాకలి హనుమంతప్ప పొలంలోని జాలి చెట్టు ఆదివారం పిడుగు పడడంతో విరిగిపోయింది. వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెట్ల కింద నిలబడరాదని అధికారులు కోరుతున్నారు.

# మేల్కొనకపోతే ముప్పే..!

## మూడు మోటార్లకు గాను పనిచేస్తున్నది ఒక్కటే.. అది ఆగితే అధోగతి..



మరమ్మతుకు గురైన పంప్‌సెట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - హిందూపురం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం పురపాలక సంఘంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని పీఏబీఆర్ నుంచి శ్రీరామిరెడ్డి నీటి పథకం ద్వారా నీటిని తీసుకు వచ్చినప్పటికీ, పట్టణ ప్రజల అవసరం మేరకు అందకపోవడంతో సమస్య జఠిలమైంది. దీనిని గుర్తించిన అప్పటి ప్రభుత్వం 2018లో రూ.194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం పురపాలక సంఘానికి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని తీసుకువచ్చింది. ఆ సమయంలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రెండు చోట్ల ఎత్తిపోతల పథకం ద్వారా ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ప్రతిచోట మూడు మోటార్లతో నీటిని పంపింగ్ చేయాల్సుంది. అయితే మూడు ప్రాంతాలలోనూ ఒకే మోటారు పనిచేస్తోంది. ఆ మోటర్ ఏ క్షణంలో ఆగిపోయినా పట్టణంలో నీటి సమస్య ఉత్పన్నం అవుతుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే మేల్కొనకపోతే పట్టణానికి నీటి ముప్పు తప్పదు.

హిందూపురం పురపాలక సంఘంలో దాదాపు 1.80 లక్షల మంది నివసిస్తున్నారు. వీరందరికీ తగినంత నీటిని అందించాలంటే రోజుకు కనీసం 20 మిలియన్ల లీటర్ల నీరు అవసరం ఉంది. అయితే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి ఒక్క మోటారు ద్వారా అంత నీరు సరఫరా కావడం లేదు. గొల్లపల్లి నుంచి వచ్చే నీటితో పాటు పురపాలక సంఘంలో ఉన్న మోటార్ల ద్వారా వచ్చే నీటితో కలుపుకుంటే ఇందులో సగం కూడా నీటిని ప్రజలకు అందించడం లేదు. వాస్తవానికి ప్రాజెక్ట్ రూపొందించిన సమయంలో సంవత్సరానికి 0.3 టిఎంసి నీటిని జల వనరుల శాఖ హిందూపురానికి కేటాయించింది. ఈ నీటితో పట్టణానికి ప్రతిరోజు 30 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. పట్టణానికి నీటిని సరఫరా చేయడానికి గొల్లపల్లి ప్రాజెక్టులో ఇంటెక్ వెల్‌ను, ఎస్‌కెడి, సోమందేపల్లి తండా వద్ద పంప్‌హౌస్‌లను నిర్మించారు. వీటి ద్వారా పట్టణంలోని పుట్లూరు వద్ద ఉన్న నీటి శుద్ధకేంద్రానికి, అక్కడి నుంచి మోతకపల్లి సంపునకు నీటిని సరఫరా చేస్తారు. శుద్ధిచేసి పట్టణంలోని అన్ని వార్డులకు అందించాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పైప్ లైన్ లేకపోవడంతో ఈ నీరు పట్టణంలో కొన్ని ప్రాంతాలకు వెళ్లడం లేదు. వైఫ్ లైన్ సౌకర్యాలు ఉన్న వార్డులకు మాత్రమే వారానికి ఒక్కసారి శుద్ధ జలాన్ని అందిస్తున్నారు.

### ప్రతి చోటా సమస్యలే

నీటి సరఫరా ప్రారంభమయ్యే గొల్లపల్లి ప్రాజెక్టు వద్ద నిర్మించిన ఇన్‌టెక్ వెల్ లో మూడు మోటార్లు పనిచేయాల్సుంది. ఇందులో రెండు మోటార్లు మరమ్మతుకు గురి కావడంతో ఒక్క మోటరు మాత్రమే పనిచేస్తున్నది. వీటితో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్యానెల్ పూర్తిగా పాతబడిపోయాయి. వాటిని తొలగించి ఆ స్థానాల్లో కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉన్న ఒక్క మోటర్ నిరంతరం పనిచేస్తుండడంతో ఏ క్షణంలోనైనా ఆగిపోయే ప్రమాదం ఉంది. ఇక రెండవ పంపింగ్ కేంద్రమైన ఎస్‌కెడి వద్ద మూడు మోటార్లలో ఒక్కటి పూర్తిగా పాడవగా, మరొకటి బేరింగ్‌లు పోయి నిలిచిపోయింది. అక్కడ సైతం ఒక్క మోటారే పనిచేస్తున్నది. ఇక సోమందేపల్లి తండా వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో రెండు ట్రాన్స్ ఫార్మర్లలో ఒకటి పనిచేయడం లేదు. మరొక ట్రాన్స్ ఫార్మర్ తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక చివరిగా బూతుకపల్లి సంపు నుంచి పట్టణంలోని వివిధ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎత్తిపోసే మోటర్లు, పంపు సెట్లు తరచూ మొరాయిస్తుండడంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.

### నిధులు ఉన్నా పట్టించుకోని పాలకవర్గం

తాగునీటి పథకంలో సమస్యలను గుర్తించిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మున్సిపల్ ఖజానాలు రూ. 2. 3 కోట్లు కరువు నిధులు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధుల నుంచి రూ. 1.5 కోట్లతో మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను పాలకవర్గం దృష్టికి రెండు నెలల క్రితం తీసుకెళ్లారు. అయితే మరమ్మతు పనులపై వైసిపి కౌన్సిలర్లు అనుమానం వ్యక్తం చేస్తూ టెండర్లు ఆమోదించకుండా మున్సిపల్ కౌన్సిల్‌లో అడ్డుకున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు మేల్కొని అధికారులు ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలపకపోతే పురంలో మళ్లీ దాహం కేకలు వినిపిస్తాయి.

# మత్స్యకార సంఘాల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి

## జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి







**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

మత్స్యకారులు చేపల సంఘాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందవచ్చని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. చెరువులలో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే ఆ చెరువులపై ఆధారపడి చేపలను ఉత్పత్తి చేసుకొని వాటి ద్వారా జీవనోపాధి చెందుతున్న కుటుంబాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. చెరువులలోకి నీరు వచ్చినప్పుడు మాత్రమే వీరికి జీవనోపాధి దొరుకుతుంది. నీరు రాకుంటే వీరు ఇతర వత్తుల వైపు వెళ్లి జీవించాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా మూడు వేలకు పైగా కుటుంబాలు ఈ చేపల సంఘాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీరి అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటోంది. మత్స్యకారుల జీవన విధానం ఏమిటి అన్న అంశాలపై జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని చేపల సంఘాలు ఉన్నాయి? ఎన్ని కుటుంబాలు ఇందులో ఉన్నాయి.?**

**జవాబు :** జిల్లావ్యాప్తంగా 47 చేపల వృత్తిదారుల సంఘాలు ఉన్నాయి. ఇందులో 3539 కుటుంబాల సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఒక కులంతో సంబంధం లేకుండా చేపలు పట్టగలిగే ఏ కులం వారైనా సరే సంఘంలో సభ్యులుగా చేరవచ్చు. ఆయా ఆయకట్టు చెరువులకు మాత్రమే ఈ సంఘాలు ఉంటాయి.

**ప్ర : చేపల వృత్తి సంఘాల వారికి ప్రభుత్వం పరంగా అందించే సహాయం ఏమిటి.?**

**జ :** జిల్లాలో 226 నీటి ఆయకట్టు చెరువులు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 20 చెరువులకు మాత్రమే నీరు వచ్చింది. సహజంగా నవంబర్ డిసెంబర్ నెలల్లో చేప పిల్లలు వదులుతాము. ఒక్క యూనిట్‌కు లక్ష చేప పిల్లలు ఉంటాయి. వీటిని నామమాత్రపు ఫీజుతో 40 శాతం సబ్సిడీతో సంఘాలకు అందజేస్తాం. వాళ్లకు ఇదే ప్రభుత్వ పరంగా పెద్ద సహాయమని చెప్పవచ్చు. అంతేగాక వారికి చేపలు పట్టే వలలు, తెప్పలు సరఫరా చేస్తాం. కొందరికి గతంలో ద్విచక్ర వాహనాలు కూడా సరఫరా చేశాం.

**ప్ర : మార్కెటింగ్ సౌకర్యం ఎలా ఉంటుంది.?**

**జ :** ప్రత్యేకంగా మార్కెటింగ్ అంటూ ఏమీ ఉండదు. చేపలు పడుతున్నారని తెలిస్తే ఆయా గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల వారు సైతం వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొందరు బయట నుంచి వచ్చి కూడా చేపలు కొనుగోలు చేసి చిల్లరగా అమ్ముకుంటుంటారు. కొందరు వ్యాపారులు ఆయా చెరువుల వద్ద చేపలు కొనుగోలు చేసి పట్టణాలకు తరలించి అమ్ముకుంటారు. కాబట్టి ప్రత్యేకంగా మార్కెట్ సౌకర్యం అంటూ ఉండదు. ఎప్పుడో ఒకరోజు చేపలు మిగిలిపోతే వాటిని ఎండబెడతారు. ఎండు చేపలకు కూడా మంచి గిరాకీ ఉంటుంది.

**ప్ర: చేప పిల్లలు ఎన్ని మాసాలకు పెద్దగా తయారు అవుతాయి.?**

**జ :** చేప పిల్లలను చెరువులోకి వదిలిన రెండు నెలల లోపే పెద్దవి అవుతాయి. ఒక కేజీ నుంచి మూడు కేజీల పైబడి ఉత్పత్తి అవుతాయి. ఆయా చెరువులలో సంఘ సభ్యులు కాకుండా ఇతరులు దొంగగా చేపలను పట్టుకునే అవకాశాలు లేకపోలేదు. అయితే సంఘం సభ్యులు పగలు, రాత్రి నిత్యం చెరువులలో తెప్పల సహాయంతో పరవేక్షిస్తుంటారు.

**ప్ర: కొన్ని చెరువులలో చేప పిల్లలను చంపే అవకాశం ఉందా.?**

**జ:** ఆయా గ్రామ రాజకీయాలు బట్టి ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతుంటాయి. 99 శాతం అలాంటి పరిస్థితులు ఏర్పడవనే భావిస్తున్నాము. రాజకీయాలు, గొడవలు, మత్స్యకారులపై వ్యక్తిగత ద్వేషం తదితర అంశాలు కూడా చోటుచేసుకునే అవకాశాలు అక్కడక్కడ ఉండవచ్చు. అలాంటి సంఘటనల వల్ల చట్టపరంగా తగు చర్యలు పోలీసు ద్వారా తీసుకోవచ్చు.

**ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? మత్స్యకారులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి.?**

**జ :** సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. ప్రస్తుతం పెద్ద కమ్మవారిపల్లి సమీపంలో గల దీన జనోద్ధారణ భవన సదుపాయంలో కార్యాలయం ఉంది. పూర్తిస్థాయి కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. సంఘాల ద్వారా సమిష్టి నిర్ణయాలతో అభివృద్ధి చెందవచ్చు.

# కూటమిలో ఎలాంటి విభేదాలు లేవు

పరిటాల శ్రీరామ్, చిలకం, ఎస్.శ్రీనివాసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ధర్మవరంలో కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ నియామకంపై గత శనివారం స్థానిక బిజెపి కార్యాలయం ముందు టిడిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఆదివారం పరిటాల శ్రీరామ్ ఎర్రగుంటలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. కొన్ని అంశాలు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున విషయంలో అభ్యంతరాలు ఉన్నాయన్నారు. గతంలో ఆయన కమిషనర్‌గా పని చేసిన సమయంలో వైసిపికి అనుకూలంగా వ్యవహరించి టిడిపి నేతలను ఇబ్బంది పెట్టారని, ఇదే అంశాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా అన్ని అంశాలు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలి పారు. ఎన్నికల ముందు ఎలా కలసి ఉన్నామో ఇప్పుడూ అలానే ఉన్నామని స్పష్టం చేశారు. నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యమన్నారు. ధర్మవరంలో భూ కబ్జాలు, అక్రమాల గురించి మంత్రికి తెలిపామని వాటన్నిటిపై చర్యలు ఉంటాయన్నారు. సబ్ జైలు వద్ద జరిగిన ఘటన అనుకోకుండా జరిగిందన్నారు. చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ నియామకం మంత్రికి తెలిసి జరిగింది కాదని, దీనిపై మంత్రి నుంచి మాకు స్పష్టమైన హామీ వచ్చిందని, త్వరలోనే ఈ వివాదానికి తెర పడుతుంద న్నారు. సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య అపోహలు, విభేదాలు వస్తే చూసి సంతోషించే వారు చాలా మందే ఉంటారని, వారికి ఆ అవకాశం ఇవ్వమన్నారు. కమిషనర్‌పై ఇలాంటి అభిప్రాయం ఉందని మంత్రికి తెలిసి ఉంటే ఈ నియామకం జరిగేదే కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 2న మున్సిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష : యుటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2వ తేదీ పట్టణంలోని అన్ని మున్సిపాలిటీ పాఠశాలల్లో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ తెలిపారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయినా నేటికీ ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యా వ్యవస్థలో ఉన్న మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించడం లేదన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు కూడా సక్రమంగా జరగడం లేదని మండిపడ్డారు. పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇటువంటి అనేక సమస్యలపై పలుమార్లు పోరాటం చేసినా ఫలితం లేదన్నారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యాచరణ చేపట్టామని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీ పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని, అందులో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతామహాలక్ష్మి, శ్రీనివాసులు, మారుతి, తాహిర్‌వలి, రమీజాబి, నరేష్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తాం

## ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాల నూతన కమిటీని ఏర్పా టు చేసిన సందర్భంగా ఆదివారం కదిరి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం(కెడిపిఎస్ఎ) ఆధ్వర్యం లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఎపి ప్రయివేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పలవల వెంకట పవన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులు సింగారెడ్డి, అధ్యక్షులు పలవల అనిల్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, కోశాధికారి జయచంద్రనాయుడు, డీసీఈబీ మెంబర్ వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా సిఆర్ఒ రవిచంద్రారెడ్డి, కెడిపిఎస్ఎ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, కోశాధికారి రామచంద్రలను ఘనంగా సన్మానించారు. కదిరి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు శంకర్, కిరణ్‌కుమార్, అధ్యక్షులు సురేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాషా, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, కోశాధికారి కుమార్, వైస్ ప్రెసిడెంట్ శివశంకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు ఆదిశేషు, నాగిరెడ్డి, మల్లికార్జున, గౌరవ సలహాదారులు మస్తాన్, సాధిక్‌బాషా, ప్రయివేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితుల కోసం ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరపున ఆర్థిక సాయం అందజేశారు.



ఆర్‌డిటి కేంద్రంలో అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు

## ఆర్‌డిటి మనోవికాస కేంద్రంలో అన్నదానం

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

వైసిపి బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు, అభిమానులు పట్టణంలోని ఆర్‌డిటి వికలాంగుల మనోవికాస కేంద్రంలో బధిర పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. వడ్డెర సంఘం సైదాపురం రమణ, సంపంగి గోవర్ధన్ ఆధ్వర్యం లో బధితర పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. డా. బత్తల హరిప్రసాద్ తండ్రి, తమ్ముడు రాంప్రసాద్ పిల్లలకు విందు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే బత్తల ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రమణ, గోవర్ధన్, నాగర్జున, డా. రాంప్రసాద్, బాలాజీ, కాంట్రాక్టర్ బాబా, పవన్‌కుమార్‌రెడ్డి, బాబ్జాన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# అధికార లాంఛనాలతో సిఐ అర్జున్‌నాయక్ అంత్యక్రియలు



సిఐ అర్జున్‌నాయక్ భౌతిక కాయానికి అంతక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

జిల్లా ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప ట్రాఫిక్ సిఐ ఆర్.అర్జున్‌నాయక్ అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు అర్జున్ స్వగ్రామం నల్లమాడ మండలంలోని అరవాండ్లపల్లితండాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా సిఐ అర్జున్‌నాయక్ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అర్జున్ భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులతో పాటు కడప నుంచి వచ్చిన ఎఆర్ పోలీసుల గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## వైసిపి నేతకు మాజీ మంత్రి పరామర్శ

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

స్థానిక గీతానగర్‌కు చెందిన వైసిపి నాయకుడు నారాయణస్వామి(సింహం) కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకొని ఆదివారం మాజీ మంత్రి శంకరనారాయణ ఆయన ఇంటికి వెళ్లి నారాయణస్వామిని పరామర్శించి ఆర్థికసాయం చేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, లక్ష్మిరెడ్డి, వేణు, నరసింహమూర్తి, రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హాస్టల్లోకి వర్షంనీరు...



బాలికల వసతి గృహాన్ని సందర్శించిన సామకోటి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

పట్టణంలో ఉదయం 3 గంటల పాటు కురిసిన కుండపోత వర్షానికి సత్యమ్మ దేవాలయం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలోకి నీరు చేరడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకొన్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ హాస్టల్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ సమస్య ఉందన్నారు. పట్టణం అభివృద్ధి చెందడం, చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంతో చిత్రావతి నదిలోకి పోవాల్సిన నీరు మార్గం లేక లోతట్టు ప్రాంతాలైన వేణుగోపాలస్వామి ఆలయం, సత్తెమ్మ గుడి, హనుమాన్ టెంపుల్, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. గతంలో చిన్నపాటి వర్షం కురిసినా ప్రత్యేకంగా నిర్మించిన కాలువల ద్వారా నీరు చిత్రావతి నదిలోకి నేరుగా వెళ్లేవన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శామీర్, బేకరీ నాయుడు, గణేష్, పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

స్థానిక జగ్జీవన్‌నగర్‌కు చెందిన జనసేనపార్టీ కార్యకర్త పెయింటర్ రామాంజనేయులుకు కాలు విరగడంతో ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి వచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో స్పందించిన మంత్రి సవిత రూ. 10వేలు, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర రూ. 5వేలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని గురువారం హిందూపురం పార్లమెంట్ కార్య దర్శి నీరుగంటి చంద్ర, టిడిపి టౌన్ కన్వీనర్ వడ్డే సూరి ఆయన ఇంటికి వెళ్లి అందజేసి పరామ ర్శించారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ జబివుల్లా, మాజీ ఎంపిటిసి కిష్టప్ప, మాజీ సర్పంచి సూరి, దండోరా రామాంజనేయులు, జనసేన నాయకులు కొల్లప్ప, శిరీష పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత : సిఐ

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సిఐ మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. అతివేగం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనం ఇవ్వవద్దని సూచించారు. మీ కుటంబాల ను దృష్టిలో ఉంచుకుని వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఇన్‌ఛార్జి సిఐ శ్యామరావు మండలంలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**తనకల్లు :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు ఆదివారం ఎస్ఐ గోపి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి పద్ధతిగా ఉండాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠినంగా శిక్షించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి టిడిపి కార్యకర్తకు సభ్యత్వం తప్పనిసరి : పల్లె

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె



**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

ప్రతి టిడిపి కార్యకర్తకు పార్టీ సభ్యత్వం తప్పనిసరిని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక సాయి ఆరామంలో ఆదివారం నియోజకవర్గ టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు పల్లె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యత్వం ఉన్నవారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా, తదితర సౌకర్యాలు వర్తిస్తాయ న్నారు. నియోజకవర్గంలోని 195 చెరువులకు కృష్ణా జలాలు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. అమడుగూరు, ఓడి చెరువు, నల్లమాడ మండలాలకు సమగ్ర తాగునీటి పథకాన్ని తీసుకొచ్చి ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందిస్తామన్నారు. పుట్టపర్తిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలన్నదే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆశయం అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు విజయకుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, మల్లిరెడ్డి, మైలే శంకర, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, నాయకులు కాలేనాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం**

**నల్లమాడ :** మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మార్క్ గుండె ఆసుపత్రి ఆధ్వర్యంలో ం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి మాజీ మంత్రి పల్లె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ. 20 లక్షలతో కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం పొందే సౌకర్యం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్క్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నాగరాజు ఉపాధ్యాయులు జేమ్స్, టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, రెడ్డిపల్లి ప్రయివేట్ వైద్యుడు డాక్టర్ నాయుడు, ప్రేమానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎర్రవంకపల్లిలో ఓబుళప్ప ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నల్లమాడలో లివర్ సమస్యతో బాధపడుతున్న టిడిపి కార్యకర్త వెంకటలక్ష్మిని పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు. అలాగే మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

# గొల్లపల్లి తాగునీటి పథకం పరిశీలన

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురానికి తాగునీటిని అందించే గొల్లపల్లి తాగునీటి పథకాన్ని మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. తాగు నీటి పథకంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే నీటి సరఫరా ఎప్పుడైనా ఆగి పోవచ్చని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. వెంటనే మూడు ప్రాంతాలలో మూడు మోటార్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా జరిగితే పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించడానికి సాధ్యం అవుతుందని చెప్పారు. కమిషనర్ సంగం శ్రీనివాసులు మాట్లాడుతు ఇప్పటికే ఒక మోటారు మరమ్మతుకు పంపడం జరిగిందని, మిగిలిన మోటార్లతో పాటు పంపులు, ప్యానల్ బోర్డులు, వికె తాండ వద్ద ట్రాన్స్ ఫార్మర్ వెంటనే మరమ్మతులు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి నిధులు తీసుకు రావడంతో గుత్తేదారులతో మాట్లాడి మరమ్మతు పనులు ప్రారంభం అయ్యే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ జనార్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నృత్యకళలపై పరీక్షలు



లలితకళ పరీక్షకు హాజరైన కళకారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో చండీగర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నృత్యకళలపై పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఎంఇఒ గంగప్ప, ఎంజీఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, నాట్య గురువు సుధా స్రవంతి, చంద్రబాను చతుర్వేది ఈ పరీక్షలను ప్రారంభించారు. పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్ గా హైదరాబాద్ కు చెందిన జ్యోతి శేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చండీఘర్ యూనివర్సిటీ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తుండగా, ఈసారి హిందూపురంలో కూడా ఈ పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో 9 గ్రేడ్లు ఉంటాయని తెలిపారు. పిల్లలు లలిత కళలను మధ్యలోనే ఆపివేయకుండా చివరిదాకా నేర్పించే బాధ్యతను విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కళా నిలయమైన హిందూపురంలో ఈ పరీక్ష నిర్వహిం చడం సంతోషంగా ఉందన్నారు. గతంలో పరీక్ష రాయాలంటే హైదరాబాద్, విజయవాడ, ముంబై లాంటి కేంద్రాల్లో పరీక్షను నిర్వహించే వారని, అలాంటి కేంద్రాన్ని హిందూపురానికి తీసురావడా నికి కృషి చేసిన అభిజ్ఞా నృత్యాలయం గురువు చంద్రబాను చతుర్వేదిని అభినందించారు. కార్యక్రమంలో కళకారులు పాల్గొన్నారు.

# నేడు టిడిపి శ్రేణులతో సమావేశం : ఎమ్మెల్యే



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

**ప్రజాశక్తి-మడకశిర**

పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం ఉదయం 10 గంటలకు క్లస్టర్, యూని ట్, బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాల యంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పట్టణ, మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, హాజరుకావాలన్నారు.

# కళాకారుడు ఆనంద్‌కుమార్‌కి డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ఆనంద్‌కుమార్

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

మండలంలోని చెరువు ముందరపల్లి గ్రామానికి చెందిన కళాకారుడు సిహెచ్.ఆనంద్‌కుమార్‌కి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ని ప్రదానం చేసింది. ఆనంద్‌కుమార్ మంచి కళాకారుడు, డ్రామా ఆర్టిస్ట్, హార్మోనిస్ట్. ఎపితో పాటు కర్నాటకలో తన కళను ప్రదర్శిస్తూ మంచి గుర్తింపు పొందారు. ఇతని ప్రతిభను గుర్తించిన 'ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ' వారు శనివారం తమిళనాడులోని హోసూర్‌లో ఆనంద్‌కుమార్‌కి డ్రామా ఆర్టిస్ట్ మ్యుజీషియన్(హార్మోనియం) సంగీత విద్వాన్ విభాగంలో డాక్టరేట్ అందజేశారు. అలాగే సోషల్ సర్వీస్, డెడికేషన్ అవార్డు అందజేశారు. డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## శరన్నవరాత్రుల కరపత్రాలు విడుదల

**లేపాక్షి :** స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకూ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అధికారులు, భక్తులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శీనస్వామి, సింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన సాకే నారాయణ, సాకే నారాయణమ్మల జ్ఞాపకార్థం ఆదివారం వారి కుమారుడు సాకే ఈశ్వరయ్య, పద్మావతి దంపతులు గొట్లూరు అనాథాశ్రమంలో అన్నదానం, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో రమేష్, లక్ష్మీనరసమ్మ, నరేంద్ర, శిరీష, అక్కులప్ప, జ్యోతి, హేమలత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి వెళ్లి వ్యక్తి మృతి

**గోరంట్ల :** రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని కాగానపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాగానపల్లి గ్రామ సమీపంలో ఉన్న చాకలి వెంకటస్వామి, శ్రీనివాసులు పంట పొలాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై సోమందేపల్లికి చెందిన మహబూబ్‌బాషా(40) మృతి చెందాడు. మృతుడు గుజిరి వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## జూదరుల అరెస్ట్

**బుక్కపట్నం :** మండలంలోని ధూపంపల్లి గ్రామ సరిహద్దుల్లో కోడిపందెం నిర్వహిసున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ధూపంపల్లి గ్రామ సరిహద్దుల్లో శనివారం కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అందులో చెన్నేకొత్తపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి, నాగరాజు, ముత్యాలు, ధర్మవరం పట్టణానికి చెందిన రాఘవేంద్ర, రాజులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 23,500 నగదు, 6 పందెం కోళ్లు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడైనా పేకాట, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**తనకల్లు :** మండలంలోని ఈతోడు గ్రామ శివారులో ఆదివారం కోడిపందెం నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు.. ఈతోడు గ్రామ శివారులో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులతో కలిసి దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 30,350 నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన కరాటే క్రీడాకారులు

## జిల్లా స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

**హిందూపురం :** ఉమ్మడి అనంతపురం జిల్లా అండర్-19 బాల బాలికల కరాటే ఎంపిక పోటీలను పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఒ గంగప్ప, ఎస్ జి ఎఫ్ అండర్-19 కార్యదర్శి లక్ష్మీనారాయణలు హాజరై పోటీలను పర్యవేక్షించారు.కరాటే పోటీల్లో బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచిన రియాజ్, షాబాజ్, మోహనకృష్ణ, హరీష్, లోకేష్‌ను, బాలికల విభాగంలో బిరీర, నిఖిత, సిరి, నస్రిన్, మదీహ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు కడప జిల్లా రాజంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు లోకనాథ్, సురేష్ మోరార్డ్, కరాటే కోచ్‌లు ఫిరోజ్, షేక్షావలి. జనార్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రజలు నేరుగా కలవొచ్చు : డీఎస్పీ

**హిందూపురం :** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోనే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హిందూపురం డి.ఎస్.పి కెవి మహేష్ వెల్లడిం చారు. ఆదివారం ఆయన మాట్లాడుతు హిందూపురం సబ్ డివిజన్ పరిధిలో ఏ సమస్యలు ఉన్నా ప్రజల తమ ఫిర్యాదుతో వచ్చి తనను నేరుగా కలవవచ్చునని తెలిపారు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేయలేని వారు సెల్ ఫోన్ నెంబరు 9281107076 ద్వారా సంప్రదించవచ్చునన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

**కొత్తచెరువు :** స్థానిక బిసి కాలనీలో ఉన్న హాస్టల్ విద్యార్థులకు ఆదివారం చెరుకూరి చంద్రశేఖర్ సహకారంతో మానవ హక్కుల సంఘం నాయకులు భాస్కర్‌నాయుడు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.